సాక్షి కర్నూలు

మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



హరిద్వార్‌లో పీఠాధిపతి

మంత్రాలయం రూరల్: హరిద్వార్‌లో నిర్మాణంలో ఉన్న శ్రీ రాఘవేంద్రస్వామి మఠాన్ని పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థులు పరిశీలించారు. అనంతరం గంగమ్మకు పూజలు చేశారు.



'కారుణ్య' ఇంటర్వ్యూలు

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణా శాఖలో కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చేందుకు సోమవారం కర్నూలులో 54 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు.



వెయ్యి నెలల పుణ్య ఫలం

బడీరాత్‌కు ఎంతో విశిష్టత ఉంది. ఈ రోజు రాత్రి జాగరణ చేస్తూ ఆధ్యాత్మికంగా గడిపే వారికి అల్లాహ్ వెయ్యి నెలల పుణ్యం ఫలం ఇస్తారని మతపెద్దలు చెబుతున్నారు. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:38	ఉ॥ 4:36
ఆదోని	సా॥ 6:41	ఉ॥ 4:39
నంద్యాల	సా॥ 6:38	ఉ॥ 4:39
ఆత్మకూరు	సా॥ 6:36	ఉ॥ 4:33
బనగానపల్లె	సా॥ 6:41	ఉ॥ 4:33

హదీస్ వెలుగు :

పవిత్ర రంజాన్ మాసం ముగిసినప్పటికీ ఎలాంటి పుణ్యకార్యం చేయని, ముక్తి పొందని వ్యక్తి మనలో లేదు. అల్లాహ్ నుంచి అతడికి వినాశన శాపం ఉంది. – పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

19న ఇఫ్తార్ విందు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రంజాన్ మాసం సందర్భంగా జిల్లా సర్వోన్నతాధికారి అధ్యక్షతన ఈ నెల 19న సాయంత్రం 6.30 గంటలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సయిదా సబీహా పర్వీన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక రాయల్ ఫంక్షన్ హాల్(రోషన్ ఘాట్, ఫోర్టు)లో ఏర్పాటు చేస్తున్న కార్యక్రమానికి జిల్లాకు చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు హాజరు కావాలని ఆమె కోరారు.

మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు

- నేటి నుంచి ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్లు



కర్నూలు(అగ్రికల్చర్): 2022–23 రబీలో పండించిన మొక్కజొన్న పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కర్నూలు జిల్లాలో 26,616 ఎకరాల్లో మొక్కజొన్న సాగయింది. ఎకరాకు దాదాపు 26.6 క్వింటాళ్ల చొప్పున 70,763 టన్నుల దిగుబడి వచ్చింది. మద్దతు ధర రూ.1,962 ఉండగా.. మార్కెట్‌లో రూ.16,00 నుంచి రూ.1800 మాత్రమే పలుకుతోంది. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా మద్దతు ధరతో కొనుగోలుకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌కు అనుమతి ఇచ్చింది. రబీలో మొక్కజొన్న సాగు చేసి ఈ–క్రాప్ నమోదు చేయించడంతో పాటు ఈ–కేవైసీ చేయించుకున్న రైతులు మద్దతు ధరతో మొక్కజొన్నను అమ్ముకోవచ్చని జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ జి.రాజు తెలిపారు. ఇందుకోసం మంగళవారం సంబంధిత రైతుభరోసా కేంద్రాల్లో పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు

AADHAAR

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లోని సచివాలయాల పరిధిలో ఈ నెల 18, 19, 20, 26, 27 తేదీల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. కొత్తగా ఆధార్ నమోదు.. నమోదు పూర్తయినా కార్డు లేని వారు ఈ కేంద్రాలను సంప్రదించాలన్నారు. అలాగే 0 నుంచి 5 సంవత్సరాలు, 5 నుంచి 16 సంవత్సరాల్లోపు బాల బాలికలు, ఇంటి చిరునామా, మొబైల్ నెంబర్, ఫొటో మార్పు చేసుకోవచ్చన్నారు. వేలి ముద్రల అప్‌డేట్‌కు కూడా అవకాశం ఉందన్నారు. 2010 నుంచి 2016 సంవత్సరాల మధ్య ఆధార్ నమోదు చేసుకొని ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఆధార్ కేంద్రాల్లో అప్‌డేట్ చేసుకోని వారు ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు.

ప్రయివేటు అనారోగ్యశ్రీ!

రోగుల జేబు గుల్ల

- ప్రభుత్వ ప్యాకేజీ సరిపోదని బొంకు
- ఆరోగ్య పరిస్థితి వివరించి అధిక డబ్బు వసూలు
- మెడికల్ కేసుల పట్ల అనాసక్తి
- ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి ప్రయివేట్‌కు ఆపరేషన్ కేసులు
- ఇప్పటి వరకు 450 పైగా ఫిర్యాదులు
- నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్న అధికారులు



➤ కర్నూలు నగరంలోని పాతబస్తీకి చెందిన వృద్ధురాలు గంగమ్మ ప్రమాదవశాత్తూ ఇంట్లో కింద పడటంతో తుంటి ఎముక విరిగింది. ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆపరేషన్ చేయాలని సూచించారు. ఇన్‌ప్లాంట్ ఖరీదు ఎక్కువ అవుతుందని, ఆరోగ్యశ్రీ కింద అయితే సాధారణమైనది వేస్తామని చెప్పడంతో భయపడిపోయారు. వైద్యులు కోరినట్లు రూ.20వేలు అదనంగా ముట్టజెప్పి ఆపరేషన్‌కు సిద్ధపడ్డారు.

➤ కోడుమూరుకు చెందిన సుంకులమ్మకు ఛాతీలో నొప్పిగా ఉందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సమీపంలోని ఓ ప్రైవేటు వైద్యుని వద్దకు వెళ్లింది. ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేయించి యాంజియోగ్రామ్ చేయాలన్నారు. ఆ పరీక్ష కూడా చేశాక గుండె రక్తనాళంలో బ్లాక్ ఉందని స్టెంట్ వేయాలని చెప్పారు. దీనికి ఆరోగ్యశ్రీలో వచ్చే డబ్బు సరిపోదని, పైన రూ.30వేలు ఖర్చు పెట్టుకోవాలని చెప్పడంతో ప్రాణభీతితో ఆ మొత్తం అందజేసి చికిత్స చేయించుకున్నారు.

➤ ఎమ్మిగనూరుకు చెందిన రామాంజనేయులుకు ఇటీవల కడుపునొప్పి అధికమైంది. స్థానిక ఆర్‌ఎంపీ సహాయంతో అతను కర్నూలులోని ఓ ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రికి వచ్చాడు. అక్కడి వైద్యులు సొంత స్కానింగ్ మిషన్‌లోనే పరీక్ష చేయించి అపెండిక్స్ ఉందని నిర్ధారించారు. ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేశారు. వాస్తవంగా అతనికి ఎలాంటి అపెండిక్స్ లేదని, ఆరోగ్యశ్రీ కోసం ఆసుపత్రి నిర్వాహకులు ఇలా చేశారని కుటుంబసభ్యులు ఆరోపించారు.

కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ కార్డు జేబులో ఉందంటే ఎంతో ధైర్యం. ఎలాంటి జబ్బు వచ్చినా కార్డు ఆదుకుంటుందన్న భరోసా. అయితే కొందరు వైద్యుల దురాశ కారణంగా ఈ పథకం అభాసుపాలవుతోంది. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో అధిక శాతం రోగుల నుంచి డబ్బు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. రోగి ఆరోగ్య పరిస్థితి వివరించి భయపెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 69 ప్రైవేటు ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ అనుమతులు ఇచ్చారు. కర్నూలులోని కొత్త బస్టాండ్, గాయత్రి ఎస్టేట్‌లోని పలు చిన్న ఆసుపత్రులు సైతం ఇందులో ఉన్నాయి. అయితే ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ఆయా ఆసుపత్రులు దుర్వినియోగం చేస్తున్నాయి. ఆరోగ్యశ్రీ కింద ఇచ్చే ప్యాకేజీ సరిపోదని రోగుల నుంచి అదనంగా డబ్బు గుంజుతున్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులను తరచూ సందర్శించి రోగుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కూడా మౌనం దాల్చడం విమర్శలకు తావిస్తోంది. ఎవరైనా రోగులు వచ్చి ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకుంటామనే ధోరణి కనిపిస్తోంది.

మెడికల్ కేసులకు స్థానం లేదు

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో మెడికల్ కేసులకు స్థానం లేకుండా చేశారు. ఉదాహరణకు.. ఓ వ్యక్తికి విరేచనాలు లేదా పక్షవాతం, తీవ్ర ఆయాసం, వైరల్ ఫీవర్ వంటి వ్యాధులతో ఆసుపత్రికి వస్తే వాటికి ఆరోగ్యశ్రీ ఉన్నా ఆసుపత్రులు చేర్చుకోవడం లేదు. దీనికి ఆరోగ్యశ్రీ రాదనో, లేక మా ఆసుపత్రిలో ఈ జబ్బుకు ఆరోగ్యశ్రీ లేదనో, ప్యాకేజీ సరిపోదనో చెప్పి పంపిస్తున్నాయి. అదే డబ్బు ఇస్తామంటే వెంటనే చేర్చుకుని చికిత్స ప్రారంభిస్తున్నాయి. బ్రెయిన్ స్ట్రోక్(పక్షవాతం) వచ్చి కాళ్లు, చేతులు పడిపోయినా ఒకటి, రెండు ప్రైవేటు ఆసుపత్రులు మినహా ఎవరూ చికిత్స చేయని పరిస్థితి. కాళ్లు, చేతులు పడిపోవడం కాదు మెదడులో రక్తనాళాలు చిట్లితేనే ఆరోగ్యశ్రీ వస్తుందంటూ వెనక్కి పంపుతుండటం గమనార్హం. దీంతో పక్షవాతం కేసులకు అధిక శాతం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలే దిక్కు అవుతుంది.

డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ ఇలా..

కర్నూలు జిల్లా: 47 (ప్రయివేట్ ఆసుపత్రులు)

నంద్యాల జిల్లా: 22 (ప్రయివేట్ ఆసుపత్రులు)

ప్రభుత్వ ఆసుపత్రులు: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాల.. ఆదోని, ఎమ్మిగనూరు, బనగానపల్లె, డోన్ ఏరియా ఆసుపత్రులు

- సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలను సైతం ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చి నెట్‌వర్క్ ఆసుపత్రులుగా మార్చారు.
- పీహెచ్‌సీల్లో జరిగే ప్రసవాలకూ ఆరోగ్యశ్రీ వర్తింపు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫిర్యాదులు

- వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు బయటకు రాస్తున్నారు.
- వైద్యసేవలకు కింది స్థాయి సిబ్బంది డబ్బు అడుగుతున్నారు.

ప్రయివేట్ ఆసుపత్రుల్లో ఫిర్యాదులు

- ఆరోగ్యశ్రీ చికిత్సకు అదనంగా డబ్బు వసూలు

కుప్పలుగా ఫిర్యాదులు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులపై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటోంది. ఆయా ఆసుపత్రుల పనితీరు, వైద్యచికిత్సల విధానం, డబ్బులు ఏమైనా అడుగుతున్నారా అనే కోణంలో క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంలు, 104 వాహన సిబ్బందిచే వివరాలు సేకరిస్తున్నారు. ఇలా గత సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 450 దాకా ఫిర్యాదులు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చాయి. అందులో ఎక్కువగా డబ్బులు అధికంగా ఇచ్చామనే కోణంలోనే ఫిర్యాదులు ఉన్నాయి. ఈ విషయమై గత నెలలో జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు సైతం సీరియస్ అయ్యారు. ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలను పిలిపించి తీవ్రంగా హెచ్చరించారు. అయినప్పటికీ వారిలో మార్పు రాకపోతే యథేచ్ఛగా డబ్బు వసూలు చేస్తూనే ఉన్నారు.



ఆపరేషన్‌లకే రండి రండి

మెడికల్ కేసులకు చికిత్స చేయని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఆపరేషన్ చేయాల్సి వస్తే మాత్రం వెంటనే చేర్చుకుంటున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి సైతం రోగులను తరలించుకుపోతున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, న్యూరోసర్జరీ, కార్డియాలజీ విభాగాల నుంచి రోగులను నిత్యం ప్రైవేటు ఆసుపత్రులు వారి సొంత అంబులెన్సుల్లో తీసుకెళ్తున్నట్లు తెలుస్తోంది. తీరా ఆసుపత్రిలో చేర్చుకుని చికిత్స ప్రారంభించే సమయంలో వాస్తవానికి ఆరోగ్యశ్రీ ద్వారా వచ్చే డబ్బుకు సాధారణ స్టెంట్స్, ఇన్‌ప్లాంట్స్, మెష్‌లు తదితర వైద్యపరికరాలు వస్తాయని.. నాణ్యమైనవి వేసుకుంటే మంచిదని రోగి కుటుంబ సభ్యులతో బేరసారాలకు దిగుతున్నారు.

ఫిర్యాదులను బట్టి విచారణ



డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో డబ్బు వసూలు చేస్తున్నారని ఇటీవల కాలంలో ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయి. తాజాగా 28 మంది రోగులు, వారి సహాయకులు ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు విచారణ చేసి 9 ఆసుపత్రులపై చర్యలు తీసుకున్నాం. రోగుల నుంచి తీసుకున్న డబ్బు మొత్తానికి మూడు రెట్లు వారిచే కట్టించాం. పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ రఘు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్, కర్నూలు

'స్పందన'పై ఆడిట్ చేయిస్తా



స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ సృజన

- అర్జీలు రీఓపెన్ అయితే షోకాజ్ నోటీసులు జారీ చేస్తాం
- జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన

కర్నూలు(సెంట్రల్): స్పందన సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన ఆదేశించారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపారో లేదో తెలుసుకోవడానికి స్పందన సమస్యలపై ఆడిట్ చేయిస్తానన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించారు. జేసీ నారపురెడ్డి మౌర్య, ఎస్‌డీసీలు, ఇతర అధికారులతో కలసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఈ వారం కూడా సచివాలయాల్లో పరిష్కారం కావాల్సిన సమస్యలు జిల్లా స్థాయి స్పందనకు వచ్చాయని, వీటిలో రెవెన్యూకు సంబంధించినవే అధికంగా ఉన్నాయన్నారు. తహసీల్దార్లు స్పందించకపోవడంతోనే బాధితులు ఇక్కడికి రావాల్సి వస్తోందన్నారు. సబ్ డివిజన్, మ్యూటేషన్ సమస్యలను సచివాలయాల్లోనే పరిష్కరించాలని, ఈ అంశాలపై సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని జేసీ , జెడ్పీ సీఈఓలను ఆదేశించారు. సరైన ఎండార్స్‌మెంట్ లేకపోతే అర్జీలు రీఓపెన్ అవుతాయని, రీ ఓపెన్ అయిన అర్జీలకు సంబంధించిన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.

స్పందనలో వచ్చిన కొన్ని సమస్యలు...

➡ తనకు దేవనకొండ మండలం భైరవానికుంట రెవెన్యూ పరిధిలో 80 సెంట్ల భూమి వారసత్వంగా వచ్చిందని, అయితే ఆ భూమి ఆన్‌లైన్‌లో వేరొకరి పేరు మీద ఉందని, దానిని తన పేరిట మార్చాలని ఈడిగ శివశంకర్ గౌడ్ విన్నవించారు.

➡ తాను దివ్యాంగుడనని, తనకు 1.92 ఎకరాల భూమి ఉండగా అందులోకి వెళ్లకుండా కొందరు అడ్డుకుంటున్నారని కల్లూరు మండలం మిలటరీ కాలనీకి చెందిన నరేష్ ఫిర్యాదు చేశారు.

బీసీలను మోసం చేసింది చంద్రబాబే

- పనికిరాని పనిముట్లు ఇచ్చి పదవులు ఇవ్వలేదు
- లోకేశ్‌కు లోకజ్ఞానం లేదు.. చదువు రాని మొద్దు
- బీసీలపై ఎక్కడికైనా చర్చకు సిద్ధంగా ఉన్నాం
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఎంపీ సంజీవ్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య. చిత్రంలో కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, బీసీ నేతలు

కర్నూలు(రాజ్‌విహార్): బీసీలను మోసం చేసిన ఘనత టీడీపీ అధినేత చంద్రబాబుకే దక్కుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, కర్నూలు మేయర్ బీవై రామయ్య అన్నారు. సోమవారం స్థానిక బిర్లాగేట్ వద్ద ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో బీసీ నేతలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 ఏళ్ల పాటు సీఎంగా ఉన్న బాబు ఏనాడు బీసీ, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆలోచించలేదని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకొని వదిలేశారన్నారు. కానీ టీడీపీ హయాంలోనే బీసీలకు మేలు జరిగిందని నారా లోకేశ్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. లోకేశ్‌కు లోకజ్ఞానం లేదని, అతడు చదువు రాని మొద్దు అని విమర్శించారు. బీసీలకు పనికిరాని పనిముట్లు ఇచ్చారు తప్ప పదవులు ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. నాయీ బ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానని చంద్రబాబు అవమానించారని, రజకులు, ఇతర బీసీ కులాలను వేధించారన్నారు. బీసీ రిజర్వేషన్లపై టీడీపీకి చెందిన నాయకుడితో కోర్టుల్లో కేసులు వేయించారన్నారు.

82,350 మంది బీసీలకు పదవులు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక 139 బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు చైర్మన్లను, డైరెక్టర్లను నియమించిందని రామయ్య అన్నారు. స్థానిక సంస్థల నుంచి మంత్రి వర్గం వరకు అన్నింటిలోనూ 50 నుంచి 59.95 శాతం పదవులు బీసీలకు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. సంక్షేమ పథకాల పేరుతో బీసీల బ్యాంక్ ఖాతాల్లోకి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.60లక్షల కోట్ల నగదును జమ చేసిందన్నారు. బీసీల్లో 82,350 మందికి వైఎస్సార్‌సీపీ వివిధ పదవులు ఇచ్చిందని గుర్తు చేశారు. టీడీపీ హయాంలో తహసీల్దార్‌ను కూడా బదిలీ చేయించుకోలేకపోయానని మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి స్వయంగా చెప్పారని, బీసీలకు ఆ పార్టీలో ఎలాంటి ప్రాధాన్యత ఇచ్చారో కేఈ మాటలే స్పష్టం చేస్తున్నాయన్నారు.

లోకేశ్.. వాస్తవాలు తెలుసుకో

కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో 50 శాతం బీసీలు ఉన్నారని, అయితే టీడీపీ హయాంలో కేవలం ఐదుగురికి మాత్రమే చంద్రబాబు పదవులు ఇచ్చారన్నారు. కులాలకు పనిముట్లు ఇచ్చి బలహీన వర్గాలను కేవలం పనిముట్లకే పరిమితం చేసి అవమానించారన్నారు. రాజకీయ పదవులిచ్చి సమాజంలో బీసీలకు గుర్తింపు కల్పించిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. కర్నూలులో బీసీల అభివృద్ధి గురించి మాట్లాడే ముందు లోకేశ్ వాస్తవాలు తెలుసుకోవాలి సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్ర బోస్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ మాట్లాడుతూ బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా గుర్తింపు కల్పించిన పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు రాజేశ్వరరెడ్డి, విక్రమ సింహారెడ్డి, పార్టీ నాయకులు ధనుంజయ ఆచారి, నాగరాజు యాదవ్, గోపాల్‌రెడ్డి, ప్రశాంత్, లక్ష్మీ కాంతయ్య పాల్గొన్నారు.

సేవలు సులభతరం చేస్తూ.. భక్తులపై భారం తగ్గిస్తూ!

- గతంలో ఆన్‌లైన్ టికెట్‌కు హ్యాండ్లింగ్ చార్జీల పేరుతో 3 శాతం వసూలు
- నిర్వహణ చార్జీలను రద్దు చేసిన దేవస్థానం
- ఆర్జిత సేవా భక్తులకు కొంత ఊరట



శ్రీశైలం వెబ్‌సైట్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లన్న మల్లికార్జున స్వామి సేవలో తరించే భక్తులకు దేవస్థానం మరిన్నీ సౌకర్యాలు అందుబాటులోకి తెస్తోంది. ఓ వైపు సేవలను సులభతరం చేస్తూనే మరో వైపు ఆర్జిత సేవలు నిర్వహించే భక్తులపై కొంత భారాన్ని తగ్గిస్తూ దేవస్థానం నిర్ణయం తీసుకుని అమలు చేస్తోంది. గతంలో నిత్యం జరిగే అన్ని ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు ఆన్‌లైన్‌లో తీసుకుంటే ఒక టికెట్‌పై 3 శాతం నిర్వహణ చార్జీల పేరుతో భక్తుల నుంచి అదనంగా వసూలు చేసేవారు. బ్యాంకులు తమ సేవలు అందిస్తున్నందుకు గాను నిర్వహణ చార్జీలు వసూలు చేసేవి. అయితే భక్తులపై అదనపు చార్జీల భారం పడకూడదని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ బ్యాంకు అధికారులకు ఆదేశాలివ్వడంతో ఈ నెల 13వ తేదీ నుంచి నిర్వహణ చార్జీలను రద్దు చేశారు. తద్వారా భక్తులకు అదనపు చార్జీల నుంచి విముక్తి కలిగింది. శ్రీశైలాలయంలో గర్భాలయ అభిషేకం, సామూహిక అభిషేకం, వీఐపీ బ్రేక్ దర్శనం, వృద్ధ మల్లికార్జున స్వామి అభిషేకం, బిల్వార్చన, ఉమామహేశ్వరస్వామి వ్రతం, సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం రుద్రహోమం, కల్యాణోత్సవం, గోపూజ, సర్పదోష నివారణ, అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గణపతి హోమం (సాక్షిగణపతి ఆలయంలో), మృత్యుంజయ హోమం, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన, కుంకుమార్చన (ప్రాకారమండపం), చండీహోమం, స్వర్ణపుష్పార్చన, నవావరణపూజ(అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో), వేదాశీర్వచనం, పుష్పాలంకృత ఊయలసేవ తదితర ఆర్జితసేవలు నిర్వహిస్తారు. ఆయా ఆర్జిత సేవలు నిర్వహించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతారు. దళారులపై ఆధారపడకుండా, భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అన్ని ఆర్జిత సేవా టికెట్లను 50 శాతం ఆన్‌లైన్ ద్వారా, మరో 50 శాతం కరెంట్ బుకింగ్ ద్వారా తీసుకునేలా వెసులుబాటు కల్పించింది. ఈ క్రమంలో ఆన్‌లైన్‌పై అవగాహన ఉన్న భక్తులు ఏ రోజు సేవ చేసుకోవాలనుకున్నారో ఆ రోజున నేరుగా ఆన్‌లైన్ ద్వారానే బుకింగ్ చేసుకునేవారు. కాగా మే 1వ తేదీ ఆర్జిత సేవా టికెట్లను మొత్తం ఆన్‌లైన్‌లోనే పొందేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో భక్తులపై హ్యాండ్లింగ్ చార్జీల భారం పడకుండా దేవస్థానం చర్యలు తీసుకుంది.



రోజుకు రూ. 50 వేల మేర భక్తులపై తగ్గిన భారం

శ్రీశైలాలయంలో జరిగే ఆర్జిత సేవలు, వీఐపీ బ్రేక్ టికెట్లు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుంటే భక్తుల నుంచి నిర్వహణ చార్జీల పేరుతో టికెట్టుపై 3శాతం అదనపు చార్జీలు వసూలు చేసేవారు. ఉదాహరణకు..గర్భాలయ అభిషేకం టికెట్టు రూ.5 వేలు, ఈ టికెట్టును ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుంటే నిర్వహణ చార్జీల పేరుతో అదనంగా రూ.150 వసూలు చేసేవారు. అంటే గర్భాలయ టికెట్టుకు రూ.5,150 భక్తులు చెల్లించాలి. సగటున రోజుకు 1,500 ఆర్జితసేవల టికెట్లు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుంటారు. అలాగే మే 1వ తేదీ నుంచి అన్ని ఆర్జితసేవలు ఆన్‌లైన్ ద్వారానే భక్తులు బుకింగ్ చేసుకోవాలి. ఈ క్రమంలో భక్తులపై అదనపు భారం గురించి తెలుసుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తక్షణమే స్పందించి అధికారులతో మాట్లాడారు. మంత్రి ఆదేశాలతో ఈ నెల 13వ తేదీ నుంచి అదనపు చార్జీలను రద్దు చేసింది. దీంతో నిర్వహణ చార్జీల భారం నుంచి భక్తులకు విముక్తి కలిగింది. ప్రస్తుతం రోజు నిర్వహిస్తున్న ఆర్జిత సేవా టికెట్ల అంచనా మేరకు భక్తులపై రూ. 50 వేల వరకు భారం తగ్గనుంది. దేవస్థానం నిర్ణయంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేవలం లావాదేవీల చార్జీలే..

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నూతన పేమెంట్ గెట్‌వే చేసేందుకు దేవస్థానం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సెక్యూరిటీ ఆడిట్ కూడా పూర్తవడంతో ఈ నెల 13వ తేదీ నుంచి నిర్వహణ చార్జీలు రద్దు చేశారు. కేవలం లావాదేవీల నిర్వహణ చార్జీలు వసూలు చేస్తారు. డెబిట్‌కార్డు, యూపీఐ ద్వారా ఎలాంటి చార్జీ ఉండదు. క్రెడిట్‌కార్డు ద్వారా 0.6 శాతం, నెట్ బ్యాంకింగ్ రూ.5 మాత్రమే వసూలు చేస్తారు.

నిర్వహణ చార్జీలు రద్దు

ఈ నెల 13 నుంచి నిర్వహణ చార్జీలను రద్దు చేశాం. శ్రీశైలంలో నిర్వహించే అన్ని ఆర్జిత, వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకుంటే భక్తులపై అదనపు భారం పడుతుందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మంత్రి ఆదేశాలతో గెట్‌వే చార్జీల నిర్వహణను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు చేపట్టే లా చర్యలు చేపట్టాం. భక్తులకు కొంత ఊరట కలిగింది.

– లవన్న, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీ చైర్మన్లను కలిసిన కలెక్టర్





జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి, హెచ్‌ఆర్‌సీ చైర్మన్ సీతారామమూర్తికి మొక్కలు అందిస్తున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): లోకాయుక్త చైర్మన్ జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్‌సీ) చైర్మన్ మాంధాత సీతారామమూర్తిని వారి కార్యాలయాల్లో సోమవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజన మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు జిల్లా యంత్రాంగం తరపున తమకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు ఉన్నాయని జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి, హెచ్‌ఆర్‌సీ చైర్మన్ మాంధాత సీతారామమూర్తి తెలిపారు. ముమ్ముందు కూడా ప్రశాంత వాతావరణంలో సంబంధాలు కొనసాగేలా చూస్తానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. హెచ్‌ఆర్‌సీ కార్యాలయంలో జ్యుడీషియల్ సభ్యుడు దండే సుబ్రమణ్యాన్ని కూడా ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

కొండ చిలువ కలకలం



సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో సోమవారం ఓ కొండ చిలువ కలకలం రేపింది. గ్రామం నుంచి క్రిష్ణదొడ్డి గ్రామానికి వెళ్లే దారిలో కొండచిలువ రోడ్డుపైకి రావడంతో అటుగా వెళ్లేవారు భయపడి రాళ్లతో దాడి చేశారు. దీంతో దాదాపు 10 అడుగులున్న అది హతమైంది. అయితే కొండ, చెరువు ప్రాంతం కావడంతో పాముల సంచారం సహజం. కొండ చిలువ కనిపించడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

వెయ్యి నెలల పుణ్య ఫలం బడీరాత్

- నేడు రంజాన్ 'లైలతుల్ ఖదర్'
- రాత్రంతా ప్రత్యేక ప్రార్థనలు చేయనున్న ముస్లింలు
- వెయ్యి నెలలు ఆధ్యాత్మికంగా గడిపిన పుణ్యం లభిస్తుందంటున్న మౌల్వీలు

కర్నూలు (రాజ్‌విహార్): లైలతుల్ ఖదర్ .. వెయ్యి నెలలకు పైగా అల్లాహ్ స్మరణం, నమాజ్, దువా, ప్రత్యేక ప్రార్థనలు చేసిన పుణ్యం ఫలం లభించే రేయి. దీనిని ముస్లింలు 'బడీ రాత్' (పెద్ద రాత్రి) అని కూడా అంటారు. పవిత్ర రంజాన్ మాసంలో లైలతుల్ ఖదర్‌కు ప్రత్యేక స్థానం ఉంది. రాత్రి ఇషా నమాజ్ నుంచి తెల్లవారు జామున సహెరి వేళ వరకు ముస్లింలు ఆధ్యాత్మికంగా గడుపుతారు. పగలంతా రోజా ఉంటారు. రాత్రంతా ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. తరావీహ్ నమాజ్, బయాన్, హదీస్, ఖురాన్ తిలావత్, సలాతుల్ తజ్బీ, తహజ్జుద్ నమాజ్, దువా ఇలా రేయంతా అల్లాహ్ ఆరాధనలో గడుపుతారు. తమ కష్ట, నష్టాలు విన్నవించుకుంటారు. వాటిని దూరం చేయాలని వేడుకుంటారు. పాపాలను దహించాలని మొరపెట్టుకుంటారు. తౌబా, అస్తగ్ ఫిరుల్లా చదివి తప్పుల నుంచి క్షమాపణ కోరి, నరకం, నరకాగ్ని నుంచి ముక్తి కోరుతారు. ఒక తల్లి ప్రేమ కంటే డెబ్బై రెట్లు అధికంగా ప్రేమ చూపే అల్లాహ్.. పిల్లల తప్పులను తల్లి క్షమించినట్లు అనంత కరుణామయుడు కూడా మనుషుల మొర విని కరిగిపోతారు. చేసిన పాపాలు, తప్పులను క్షమించి, ముక్తి కలిగిస్తారు. మంగళవారం జాగరణ చేస్తే ఒకటి రెండు కాదు.. ఏకంగా వెయ్యి నెలలకు పైగా ఆధ్యాత్మికంగా గడిపిన పుణ్య ఫలాన్ని అందిస్తారు. అదే లైలతుల్ ఖదర్ విశిష్టత అని మౌల్వీలు అంటున్నారు.

వెయ్యి నెలల పుణ్యం ఎందుకంటే?

మహమ్మద్ ప్రవక్త (నబీ) సొల్లెల్లాహు అలైహి వసొల్లం కంటే పూర్వం ఉన్న ప్రవక్తల కాలంలో మనుషుల ఆయుష్షు వందల ఏళ్లు ఉండేదని హదీసుల ద్వారా తెలుస్తోంది. నాటి ముస్లింలు వందల ఏళ్లు ఆధ్యాత్మికంగా గడిపి స్వర్గానికి మార్గం ఏర్పాటు చేసుకునే వారు. అయితే ఆయుష్షు రానురాను మరింత తగ్గుతుందని, నాటి ప్రవక్తల కాలంలో ఉమ్మత్ సంపాదించుకున్న పుణ్యంతో పోల్చితే తన ఉమ్మత్ (ప్రవక్త సూచించిన మార్గాలను అనుసరించే మనుషులు) పుణ్యం తక్కువగా ఉంటుందని భావించారు మహమ్మద్ ప్రవక్త. ఈ విషయంపై అల్లాహ్‌ను వేడుకుంటూ.. ఆయుష్షు తక్కువగా ఉన్న తన ఉమ్మత్‌కు అధికంగా పుణ్యం లభించే మార్గాలు చూపాలని విన్నవించుకున్నారు. పలు మార్గాలు చూపినా మహమ్మద్ ప్రవక్త సంతృప్తి చెందకపోవడంతో చివరకు లైలతుల్ ఖదర్‌ను తెస్తున్నట్లు అల్లాహ్ ప్రకటించారు. ఈ లైలతుల్ ఖదర్ రాత్రంతా జాగారణ చేసి, ఆధ్యాత్మికంగా గడిపిన వ్యక్తికి వెయ్యి నెలలకు పైగా స్మరించుకున్న పుణ్యం ఇవ్వనున్నట్లు చెబుతారు. దైవ దూతలందరూ భూమి పైకి వచ్చి ఆధ్యాత్మికంగా గడిపే వారితో కరచాలనం చేసుకొని 'అల్లాహ్ మీ ప్రార్థనలు అంగీకరించారని' అభినందిస్తారని తెలుస్తోంది. వెయ్యి నెలల అంటే 83ఏళ్ల నాలుగు నెలలు ఆధ్యాత్మికంగా గడిపినంత పుణ్యం లభిస్తుందని అంటారు.



కర్నూలులో రంజాన్ ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

చివరి దశకంలోనే లైలతుల్ ఖదర్

రంజాన్‌లోని ఆఖరి అష్ర (చివరి పది రోజులు) లోనే లైలతుల్ ఖదర్ దాగి ఉందని మహమ్మద్ ప్రవక్త సొల్లెల్లాహు అలైహి వసొల్లం తన సహచర సహబాలకు సూచించినట్లు పవిత్ర గ్రంథాలు చెబుతున్నాయి. మూడు భాగాలుగా ఈ నెలలోని చివరి 'జహన్నంసే ఫనా మాంగ్‌నేకా అష్ర'లో పెద్ద రాత్రి ఉంటుంది. అయితే ఏ రోజున అని స్పష్టత లేదు. కానీ 21, 23, 25, 27, 29 ఉపవాస దీక్షలు పాటించడం కంటే ముందు రోజు రాత్రుల్లో ఏదైనా ఒక దానిలో ఉందని, తాఖ్ రాత్ పేరుతో జాగరణ చేయాలని మహమ్మద్ ప్రవక్త బోధించారు. అంటే ఈ నెల 12, 14, 16, 18, 20 తేదీల్లో జాగరణ చేయాల్సి ఉంటుంది. అయితే నాలుగవ తాఖ్‌రాత్ అంటే మంగళవారం రాత్రి లైలతుల్ ఖదర్ పేరుతో అత్యధిక శాతం మంది జాగరణ చేస్తూ ఆధ్యాత్మికంగా గడపడం ఆనవాయితీగా వస్తోంది.

దైవ దూతలంతా కిందికి వస్తారు



రంజాన్‌లోని లైలతుల్ ఖదర్ రాత్రికి ఎంతో విశిష్టత ఉంది. పెద్దరాత్రిన జాగరణ చేస్తూ ఆధ్యాత్మికంగా గడిపే వారికి అల్లాహ్ వెయ్యి నెలల పాటు పుణ్యం చేసిన ఫలితం ఇస్తారు. దైవదూతలంతా భూమిపైకి వచ్చి అల్లాహ్ కోసం ప్రార్థించే వారికి శుభాభినందనలు తెలుపుతారు. – **సయ్యద్ షా ముహమ్మద్ హుసేని పీర్ ఖాద్రీ, హాఫీజ్ ఓ ఆలీమ్, కర్నూలు.**

ప్రత్యేక ప్రార్థనలతో అధిక ఫలితం



పెద్ద రాత్రి రోజున జాగరణ చేసి, ఆధ్యాత్మికంగా గడపాలి. నమాజ్, తరావీహ్, నఫిల్ నమాజ్, తహజ్జుద్ వంటి ప్రత్యేక ప్రార్థనలతో అధికంగా ఫలితం లభిస్తుంది. అల్లాహ్ స్మరణంతో గడిపితే వెయ్యి నెలలు ఆరాధించిన పుణ్యం లభిస్తుందని పవిత్ర గ్రంథాలు చెబుతున్నాయి.
– **డి. బందేనవాజ్, హిందీ ఉపాధ్యాయుడు, కర్నూలు.**

మోటారు మరమ్మతులపై ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులకు ఎలక్ట్రిక్ మోటారు రీవైండింగ్, రిపేర్ సర్వీసెస్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం మే నెల 5న మొదలై 30 రోజుల పాటు కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు వారు చదవడం, రాయడం వచ్చి ఉండాలని, శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన యువకులు ఆరు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాతో పాటు విద్యార్హతల జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కల్లూరు తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న కెనరా బ్యాంకు హౌసింగ్ బోర్డు బ్రాంచ్ పైన మూడో అంతస్తులోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000710508 నంబరుకు ఫోన్ చేయవచ్చని సూచించారు.

క్రేన్ ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన సాధిక్ ఆలం అన్సారీ

ఓర్వకల్లు: గుమ్మితం తండా వద్ద నిర్మిస్తున్న సోలార్ పరిశ్రమలో పనిచేస్తున్న ఓ యువకుడు క్రేన్ ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సాధిక్ ఆలం అల్సారీ(22), అతని సోదరుడు అన్వర్ అన్సారీ కొంత కాలంగా గ్రీన్‌కో సంస్థ చేపడుతున్న సోలార్ పరిశ్రమలో దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. రోజు మాదిరిగానే తమ్ముడు సాధిక్ భారీ క్రేన్ వద్ద మట్టిని తవ్వుతున్న ప్రాంతంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో సాధిక్‌కు క్రేన్ తగలడంతో తీవ్రగాయాలకు గురయ్యాడు. దీంతో కంపెనీ వారు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని సోదరుడు అన్వర్ అన్సారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున సోమవారం తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



పాణ్యం: అలమూరు – గోనవరం రహదారిలో సోమవారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతుడి వద్ద ఆధారాలు సేకరించారు. మృతుడు బనగానపల్లె మండలం రామతీర్థం గ్రామానికి చెందిన షరాబు ప్రభాకర్ ఆచారి(42)గా గుర్తించినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మృతుడి భార్య దీప్తిని విచారించగా.. ఈనెల 16వ తేదీన రాత్రి 8.30 గంటలకు పని ఉందంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో బంధువులు, స్నేహితులకు సమాచారం ఇచ్చి గాలించారు. కాగా సంఘటన స్థలంలో బైక్, మృతుడి శరీరంపై చిన్న చిన్న గాయాలు, కళ్ల నుంచి రక్తస్రావమైందని, ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



సురేష్ (ఫైల్)

చిప్పగిరి: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కాజీపురం గ్రామానికి చెందిన నారాదారి సురేష్ (23) మద్యానికి బానిసై ఎక్కువ మొత్తంలో డబ్బును వాడుకున్నాడు. డబ్బులు తన తల్లి దండ్రులు అడుగుతారని భయపడి ఆదివారం పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. మృతుని కుటుంబసభ్యులను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ పరామర్శించారు.

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితులను అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ

కౌతాళం: మండల పరిధిలోని తోవి గ్రామానికి చెందిన హుసేని, పరశురాం సోమవారం ద్విచక్ర వాహనంపై కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి ద్విచక్ర వాహనంతో పాటు పది బాక్స్‌ల్లోని 960 టెట్రా ప్యాకెట్లను సీజ్ చేసినట్లు చెప్పారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

ముఖ ఆధారిత హాజరు వేయాల్సిందే

–డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు తప్పనిసరిగా ఫేస్ రికగ్నేషన్ సిస్టమ్ ద్వారా హాజరు వేయాల్సిందేనని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. సోమవారం ఆయన జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫ్యామిలి ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యులు, సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాలను సందర్శించి రెండు పూటలా వైద్యసేవలు అందించాలన్నారు. వైద్యాధికారులు వారి పరిధిలోని హాస్టల్స్ సందర్శించి విద్యార్థులకు ఆరోగ్యసేవలు అందించాలని ఆదేశించారు. గర్భవతులు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్న వారికి తగిన చికిత్సలు అందించాలన్నారు. వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు ప్రభుత్వం ఇచ్చిన మొబైల్ ఫోన్, సిమ్‌కార్డు విధిగా వాడేటట్లు చూడాలన్నారు. వ్యాధినిరోధక టీకాల కార్యక్రమానికి సంబంధించి సూక్ష్మ ప్రణాళికను తయారు చేసి, 10 రోజుల లోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయానికి పంపాలన్నారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భవాని, డీపీఎంఓ డాక్టర్ ఉమ, ఆర్‌బీఎస్‌కే పీఓ హేమలత పాల్గొన్నారు.

లాటరీ తగిలిందని బురిడీ

- స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: మీషో యాప్‌లో రూ.11 లక్షల ఫస్ట్ ప్రైజ్ గిఫ్ట్ లాటరీ తగిలిందని, సర్వీస్ చార్జీలు, జీఎస్టీ, లేట్ పేమెంట్ కలిపి మొత్తం రూ.4.80 లక్షలు ఫోన్‌పే ద్వారా పంపితే గిఫ్ట్ మీ అడ్రస్‌కు పంపుతామని అజ్ఞాత వ్యక్తులు ఫోన్ చేసి కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్న చిన్నస్వాములును బురిడీ కొట్టించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. చిన్నస్వాములు కర్నూలు మండలం భూపాల్‌నగర్‌లోని మిలిటరీ కాలనీలో నివాసముంటున్నారు. కొన్ని నెలలుగా గుండెజబ్బుతో బాధ పడుతూ రూ.5 లక్షలు అప్పు చేసి ఇటీవలనే స్టంట్ కూడా వేయించుకున్నారు. రెండు వారాల క్రితం అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి రూ.11 లక్షల ఫస్ట్ ప్రైజ్ గిఫ్ట్ లాటరీ తగిలిందని నమ్మించాడు. మీరు ఆన్‌లైన్‌లో షాపింగ్ ఎక్కువగా చేయడం వల్ల మీ ఫోన్ నంబర్‌ను లాటరీలో తీయగా ఫస్ట్ ప్రైజ్ తగిలిందని రెండు విడతలుగా ఫోన్ చేసి నమ్మించడంతో లాటరీ డబ్బు పంపితే అప్పులు తీర్చుకోవచ్చని ఆశ పడి కోడలుకు సంబంధించిన బంగారు గాజులు, కమ్మలు విక్రయించి విడతల వారీగా రూ.4.80 లక్షలు ఫోన్ పే ద్వారా చెల్లించాడు. రెండు రోజుల్లో మీ అడ్రస్‌కు ఫస్ట్‌ప్రైజ్ గిఫ్ట్ పంపుతామంటూ నమ్మించారు. మరుసటిరోజు నుంచి ఫోన్ స్విచాఫ్ అని రావడంతో మోసపోయినట్లు గ్రహించి బాధితుడు ఎస్పీ కృష్ణకాంత్‌కు తన గోడు చెప్పుకున్నాడు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ కృష్ణకాంత్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ప్రజల నుంచి వినతులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 101 ఫిర్యాదులు వచ్చాయి.

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- పీఈటీ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కొందరు వ్యక్తులు డబ్బులు తీసుకుని మోసం చేశారని కర్నూలు పాతబస్తీకి చెందిన రమీజాబీ ఫిర్యాదు చేశారు.
- భర్త కుటుంబ సభ్యుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు పట్టణానికి చెందిన ఉజ్వల కోరారు.
- ఇల్లు కట్టించి ఇస్తామని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేశారని కర్నూలు రాజీవ్ నగర్‌కు చెందిన మహానంది ఫిర్యాదు చేశారు.
- సోషల్ మీడియాలో తన గురించి కొందరు వ్యక్తులు దుష్ప్రచారం చేస్తున్నారని, తగిన చర్యలు తీసుకోవాలని పత్తికొండకు చెందిన వెంకటేశ్వర్లు కోరారు.
- స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్పీ కృష్ణకాంత్ హామీ ఇచ్చారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటాద్రి, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.